క్లుప్తంగా...

ముగిసిన టేబుల్ టెన్నిస్ చాంపియన్‌షిప్ పోటీలు


హనీష్ అగ్రా


మైరా జైన్

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్ర టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నాలుగు రోజులుగా జరుగుతున్న 11వ రాష్ట్ర స్థాయి, ఇంటర్ డిస్ట్రిక్ టేబుల్ టెన్నిస్ చాంపియన్‌షిప్ పోటీలు సోమవారంతో ముగిశాయి. అండర్–11, 13, 15 విభాగాల పోటీలలో జంట నగరాలతో పాటు వివిధ జిల్లాలకు చెందిన క్రీడాకారులు పాల్గొన్నారు. కాగా అండర్–11 బాలికల విభాగంలో మైరా జైన్, బాలుర విభాగంలో హనీష్ అగ్రా, అండర్–13 బాలికల విభాగంలో వీబీ. మహిమా కృష్ణ, బాలుర విభాగంలో ప్రమాణ్ గెలుపొందారు. ఈ సందర్భంగా అసోసియేషన్ ప్రతినిధులు గెలుపొందిన క్రీడాకారులకు బహుమతులు ప్రదానం చేశారు.

దివ్యాంగులు ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలి


సన్మాన గ్రహీతలతో వకుళాభరణం కృష్ణమోహన్‌రావు తదితరులు

గన్‌ఫౌండ్రీ: దివ్యాంగులు ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని తెలంగాణ రాష్ట్ర బీసీ కమిషన్ మాజీ చైర్మన్ వకుళాభరణం కృష్ణమోహన్‌రావు అన్నారు. సోమవారం గన్‌ఫౌండ్రీలోని సూర్యలోగ్ కాంప్లెక్స్‌లో ఇండియన్ ప్రజా కాంగ్రెస్ పార్టీ దివ్యాంగుల విభాగం ఆధ్వర్యంలో ప్రపంచ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ రంగాల్లో రాణిస్తున్న దివ్యాంగులను ఘనంగా సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రాజ్యాధికారానికి దివ్యాంగులు అర్హులేనన్నారు. ఈ కార్యక్రమంలో పొలిటికల్ జస్టిస్ ఫ్రంట్ చైర్మన్ నారగోని, ఇండియన్ ప్రజా కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు కేబీ.శ్రీధర్, దివ్యాంగుల విభాగం జాతీయ అధ్యక్షురాలు ఉదయ లక్ష్మి, కార్యదర్శి అంజనీరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైకుంఠ ఏకాదశి ఆహ్వాన పత్రిక విడుదల

లంగర్‌హౌస్: వైకుంఠ ఏకాదశికి అందరు సకుటుంబ సమేతంగా స్వామి వారిని దర్శించి కృపాశీస్సులు పొందాలని ప్రముఖ సంఘ సేవకుడు దళితరత్న రాజు వస్తాద్ అన్నారు. లంగర్‌హౌస్ త్రివేణి సంగంలో నిర్వహించనున్న వైకుంఠ ఏకాదశి ఆహ్వాన, వాల్‌పోస్టర్‌లను పీఠాధిపతి 1008 రాహుల్‌దాస్ బాబా ఆధ్వర్యంలో సోమవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భద్రాచలాన్ని తలపించేలా ఇక్కడి ఆలయంలో వైకుంఠ ద్వారంలో యోగాలక్ష్మీనారసింహుడు ఆసీనులై ఉంటారన్నారు. జనవరి 10న తెల్లవారు జామున 3 గంటలకు వైకుంఠ ద్వారం తెరువనున్నారని, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు అల్వాల రవీందర్ రెడ్డి ఉన్నారు.

బైక్‌ల దొంగ రిమాండ్

విజయనగర్‌కాలనీ: బైక్‌లను దొంగిలించి తప్పించుకుని తిరుగుతున్న దొంగను రిమాండ్‌కు తరలించిన ఘటన టప్పాచబుత్ర పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది.సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కుల్సుంపురా ఏసీపీ మహ్మద్ మునావర్, టప్పాచబుత్ర ఇన్‌స్పెక్టర్ ఎ.రాములు వివరాల వెల్లడించారు. ఈ నెల 27న జిర్రా సర్వర్‌నగర్‌లో నివసించే ఎంఏ రహ్మన్ తన ఇంటి ముందు హోండా యాక్టీవా నిలిపి కాసేటి తర్వా వచ్చిచూస్తే కనిపించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు జిర్రా ప్రాంతానికి చెందిన మహ్మద్ ఆమేర్ (19)ను అదుపులోకి తీసుకొని విచారించగా తానే వాహనాన్ని తీసుకెళ్లినట్లు ఒప్పుకున్నాడు. నిందితుడిపై నగరంలోని 12 పోలీస్‌స్టేషన్‌లో కేసులు నమోదైనట్లు తెలిపారు. రెండు హోండా యాక్టీవాలను స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు.

బాలికపై లైంగిక దాడి కేసులో ఇద్దరు నిందితులకు జీవిత ఖైదు

సుల్తాన్‌బజార్: ఓ బాలికను బెదిరించి లైంగిక దాడికి పాల్పడిన కేసులో ఇద్దరు నిందితులకు జీవితఖైదుతో పాటు రూ.10 వేల జరిమానా విధిస్తూ న్యాయస్థానం సోమవారం తీర్పు చెప్పింది. సుల్తాన్‌బజార్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసచారి కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. 2012లో సుల్తాన్‌బజార్ ఈడెన్‌బాగ్‌కు చెందిన బాలికను అదే ప్రాంతానికి చెందిన లారెన్స్ ఫ్రాన్సిస్, జనగామకు చెందిన పొన్నాల ఆంజనేయులు బలవంతంగా గదిలోకి లాక్కెళ్లి లైంగిక దాడికి పాల్పడ్డారు. అప్పటి సుల్తాన్‌బజార్ ఇన్‌స్పెక్టర్ భిక్షపతి నిందితులపై కేసును నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. కోర్టులో చార్జిషీట్ దాఖలు చేయడంతో విచారణ చేపట్టిన నాంపల్లి 7వ అదనపు మెట్రో పాలిటన్ సెషన్స్ జడ్జి టి.అనిత నిందితులు లారెన్స్ ఫ్రాన్సిస్‌కు జీవిత ఖైదు, రూ.10 వేల జరిమానా, ఆంజనేయులుకు 20 ఏళ్ల జైలు శిక్ష రూ.10 వేల జరిమానా విధిస్తూ సోమవారం తీర్పు చెప్పారు.


మహా అన్నదాన ప్రసాద వితరణ చేస్తున్న ఎస్ఆర్.లక్ష్మణ్‌రావు తదితరులు


గోశాలలో పూజలు చేస్తున్న టీపీసీసీ కార్యదర్శి మనిలాల్‌షా తదితరులు


అన్నదానం చేస్తున్న పురానాపూల్ కార్వాన్ ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు

భక్తిశ్రద్ధలతో అమావాస్య పూజలు


మహంకాళీ ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న పూజారి సురేష్‌చారి తదితరులు


అన్నదాన కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు


అన్నదాన కార్యక్రమంలో పంకజ్ కుమార్ అగర్వాల్

సుల్తాన్‌బజార్: సోమవతి అమావాస్యను పురస్కరించుకొని కోఠిలోని నల్లపోచమ్మ ఆలయంలో బజరంగ్‌సేనా తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్ఆర్.లక్ష్మణ్‌రావు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలను నిర్వహించి భక్తులకు మహా అన్నదాన ప్రసాద వితరణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..భక్తులు అన్నదాన ప్రసాదం స్వీకరించి అమ్మవారిని దర్శించుకున్నారన్నారు. బజరంగ్‌సేనా నాయకులు శ్రీకాంత్, రవి, రఘు, సాయి, మనోజ్, నరేష్ పాల్గొన్నారు.

గోశాలల్లో అమావాస్య పూజలు..

అబిడ్స్: గోశాలల్లో సోమవతి అమావాస్య పూజలు నిర్వహించారు. సోమవారం పలు గోశాలలు గో భక్తులతో సందడిగా మారాయి. బేగంబజార్ గోశాలలో టీపీసీసీ కార్యదర్శి మనిలాల్‌షా, రణధీర్ ఠాకూర్, పురుషోత్తమ్ గుప్తా తదితరులు గోవులకు గడ్డి, కీర, క్యారెట్, ఆకుకూరలు తినిపించి గోపూజలు చేశారు.

జియాగూడలో..

జియాగూడ: ప్రతి నెలా అమావాస్య రోజున పురానాపూల్ ఆర్య వైశ్య సంఘం గోసేవా అన్నదానం కార్యక్రమాలు చేపడుతుందని సంఘం మాజీ అధ్యక్షుడు యాద శ్రీనివాస్ గుప్తా, మాడిశెట్టి సదానందం గుప్తా అన్నారు. ఈ మేరకు సోమవారం సోమవతి అమావాస్య సందర్భంగా జియాగూడ సమర్థ నారాయణ గోశాలలో గోసేవా, పూజలు, బసవ మండప్ వద్ద అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు గుండా సురేష్, ప్రధాన కార్యదర్శి జై యాదగిరి, కోశాధికారి సీహెచ్. గోవింద్, గో సేవా చైర్మన్ జలవాడి ధనుంజయ గుప్తా, మ్యాడం గోవింద్ గుప్తా, నీల కృష్ణ, భాస్కర్, బానూరి నర్సిములు, మంచు కొండ శ్రీనివాస పాల్గొన్నారు.

గోల్కొండ కోటలో..

గోల్కొండ: గోల్కొండ కోటలోని మహంకాళీ అమ్మవారి ఆలయంలో సోమవారం అమావాస్య పూజలు జరిగాయి. ఆలయ పూజారి బి.సురేష్‌చారి పూజలు నిర్వహించారు. ఈ పూజల్లో గోల్కొండ జగదాంబిక మహంకాళీ అమ్మవారి వృత్తిపని సంఘం మాజీ అధ్యక్షుడు బి.సాయిబాబాచారి, నర్సింగ్‌రావు, ప్రసాద్, శివరాజ్, స్వామి పాల్గొన్నారు.

రికాబ్ గంజ్‌లో..

చార్మినార్: సామాజిక సేవా కార్యక్రమాల్లో స్వచ్ఛంద సంస్థలు పేదలకు ఆదుకోవాలని అశోక్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు పంకజ్ కుమార్ అగర్వాల్ అన్నారు. అమావాస్యను పురస్కరించుకొని సోమవారం రికాబ్‌గంజ్‌లో అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రభుత్వం నిర్వహించే పలు సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు తోడు స్వచ్ఛంద సంస్థలు కూడా ముందుకు వచ్చి పేదలకు సహాయం చేయాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో శ్రీనివాస్, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

గౌలిపురాలో..

గౌలిపురా: వాసవి అన్నపూర్ణ సేవా సంస్థ లాల్‌దర్వాజా గౌలిపురా ఆధ్వర్యంలో సోమవారం అమావాస్యను పురస్కరించుకొని గౌలిపురా బతుకమ్మ బావి వద్ద గల లక్ష్మీనారాయణ స్వామి ఆలయంలో పరమశివునికి విశేష పూజలు, రుద్రాభిషేకం పూజలు నిర్వహించారు. అనంతరం ఛత్రినాక పాత పోలీస్‌స్టేషన్ వద్ద అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా వాసవి సేవా కేంద్రం లైఫ్ టైమ్ అడ్వైజర్ శ్రీకాసనగొట్టు రాజశేఖర్ గుప్తా, సంస్థ అధ్యక్షుడు శ్రీరాం కోటయ్య గుప్తా, సలహాదారులు ఇరుకుల్ల నరసింహులు గుప్తా, ప్రధాన కార్యదర్శి శ్రీధర మల్లికార్జున్ గుప్తా, కోశాధికారి ఇరుకుల్ల భిక్షపతి గుప్తా, సభ్యులు పాల్గొన్నారు.

సాహిల్ సింగ్‌కు గోల్డ్ మెడల్


గోల్డ్ మెడల్ సాధించిన సాహిల్ సింగ్

జియాగూడ: రెజ్లింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా తమిళనాడు అమెచ్యూర్ రెజ్లింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన 12వ సౌత్ ఇండియా సీనియర్ రెజ్లింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో తెలంగాణ నుంచి 92 కేజీల విభాగంలో సాహిల్ సింగ్ గోల్డ్ మెడల్ సాధించాడు. ఈనెల 27 నుంచి తమిళనాడు జోహిందర్ స్పోర్ట్స్ అకాడమి, తమిళనాడు స్టేట్ ఒలింపిక్ అసోసియేషన్ స్పోర్ట్స్ డెవలప్‌మెంట్ ఆఫ్ అథారిటీ ఆఫ్ తమిళనాడు సేలమ్‌లో ప్రారంభమైన పోటీలలోమంగళ్‌హాట్ ధూల్‌పేట్ లాలా తాలిమ్‌కు చెందిన క్రీడాకారుడు సాహిల్ సింగ్ గోల్డ్ మెడల్ సాధించడం గర్వంగా ఉందని శిక్షకుడు పర్వేష్ సింగ్ పహిల్వాను తెలిపారు. ఈ సందర్భంగా సాహిల్ సింగ్ మాట్లాడుతూ.. ధూల్‌పేట్ మినీ స్టేడియంలో జరిగిన శివాజీ కేసరి లాలా కేసరి, సుభాష్ చంద్రబోస్ కేసరి, తుల్జాభవాని కేసరి, ఉస్మానియా యూనివర్సిటీలలో బంగారు షీల్డ్‌లను గెలిచినట్లు తెలిపారు.

బస్తీ సమస్యలు పరిష్కరించాలి

చాంద్రాయణగుట్ట: లలితాబాగ్ డివిజన్‌లోని మల్లికార్జుననగర్ బస్తీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని స్థానికులు కోరారు. ఈ మేరకు సోమవారం స్థానికులు పగిళ్ల నరేందర్‌రెడ్డి, మిద్దెల చంద్రశేఖర్‌రెడ్డి, దయానంద్ బాబు, మోహన్‌బాబు తదితరులు జీహెచ్‌ఎంసీ జోనల్ కమిషనర్ వెంకన్నను ప్రజావాణిలో కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. బస్తీలో ఎన్నో ఏళ్ల క్రితం వేసిన రహదారులు ప్రస్తుతం శిథిలావస్థకు చేరుకోవడంతో ప్రజలకు ఇబ్బందులు కలుగుతున్నాయన్నారు. గతంలో వేసిన డ్రైనేజీ పైప్‌లైన్లు పెరిగిన జనాభాకు సరిపోక తరచూ పొంగిపొర్లుతున్నాయన్నారు. ఈ క్రమంలోనే కలుషిత నీటి సరఫరా కూడా జరుగుతుందని వివరించారు. వీధి దీపాలు సైతం వెలగకపోవడంతో రాత్రి పూట అంధకారం నెలకొంటుందన్నారు. ప్రజలకు కలుగుతున్న అసౌకర్యం దృష్ట్యా వెంటనే ఆయా పనులు చేయాలని విజ్ఞప్తి చేశారు.


జోనల్ కమిషనర్‌కు వినతిపత్రాన్ని అందజేస్తున్న మల్లికార్జుననగర్ వాసులు

జ్ఞాన్‌బాగ్ కాలనీలో ప్రభుత్వ స్థలాన్ని కాపాడాలి


డిప్యూటీ మేయర్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీఆర్ఎస్ నాయకుడు ఆనంద్‌కుమార్ గౌడ్

అబిడ్స్: జ్ఞాన్‌బాగ్ కాలనీలో ప్రభుత్వ భూమిని కాపాడాలని జీహెచ్‌ఎంసీ డిప్యూటీ మేయర్ శ్రీలతాశోభన్ రెడ్డికి గోషామహల్ నియోజకవర్గం బీఆర్ఎస్ నాయకుడు ఎం.ఆనంద్‌కుమార్ గౌడ్ విజ్ఞప్తి చేశారు. సోమవారం ట్యాంక్‌బండ్ వద్ద ఉన్న జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయంలో జరిగిన ప్రజావాణిలో ఆనంద్‌కుమార్ గౌడ్ డిప్యూటీ మేయర్ శ్రీలత, జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఇలంబర్తికి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆనంద్‌కుమార్‌గౌడ్ మాట్లాడుతూ..ఇటీవలే నగర ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్‌కి జ్ఞాన్‌బాగ్ కాలనీలో కోట్ల రూపాయాల విలువైన ప్రభుత్వ భూమి కబ్జా అవుతుందని తాను ఫిర్యాదు చేయడంతో ఆయన జీహెచ్‌ఎంసీ కమిషనర్‌కు విచారణ జరపాలని ఆదేశించినట్లు పేర్కొన్నారు. వారం రోజుల లోపల ఆ ప్రభుత్వ భూమికి సైన్ బోర్డు ఏర్పాటు చేసి భూమిని కాపాడేందుకు తగిన చర్యలు తీసుకోవాలని కమిషనర్ సీసీపీని ఆదేశించినట్లు ఆనంద్‌కుమార్ గౌడ్ వివరించారు. బీఆర్ఎస్ నాయకులు హైమద్, నరేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

7 నుంచి అయ్యప్పలకు అన్నదానం

అఫ్జల్‌గంజ్: భాగ్యనగర్ అయ్యప్ప సేవా సమితి (బాస్) ఆధ్వర్యంలో జనవరి 7 నుంచి 14వ తేదీ వరకు శబరిమలలోని నీలకల్ మార్గమధ్యంలో శబరికి వచ్చే భక్తులు, మాలధరించిన అయ్యప్ప స్వాములకు ప్రతిరోజు అల్పాహారం, అన్నదానం కార్యక్రమాన్ని నిర్వహించబోతున్నామని భాగ్యనగర్ అయ్య ప్ప సేవా సమితి అధ్యక్షుడు క్యాతం రాధాకృష్ణ, ప్రధాన కార్యదర్శి మేడిశెట్టి రాకేష్, కోశాధికారి సీఏ అనిల్ నాయర్ తెలిపారు. ఈ మేరకు సోమవారం ఉస్మాన్‌గంజ్‌లోని బాస్ ప్రధాన కార్యాలయంలో శబరిమలలో నిర్వహించే అన్నదాన, అల్పాహారం కార్యక్రమ బ్రోచర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా క్యాతం రాధాకృష్ణ మాట్లాడుతూ..16 ఏళ్లుగా నీలకల్‌లో ప్రతిరోజూ వేలాది మంది అయ్యప్ప భక్తులకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తూ విజయవంతంగా ముందుకు సాగుతున్నామన్నారు. ఈ సారి నీలకల్ మార్గమధ్యలో అన్నదాన ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించబోతున్నామన్నారు. ఈ కార్యక్రమానికి ఎవరైనా దాతలు ఆర్థిక, వస్తు రూపేనా, సహాయ సహకారాలు అందించేవారు. www.helpaneedy.in వెబ్ సైట్‌లో, తాము అందించే సహకారాన్ని అందించాలని రాధాకృష్ణ విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బాస్ ప్రతినిధులు విజయభాస్కర్, కాటేపల్లి రాజేశ్వరరావు, విజయేందర్ రెడ్డి, రోహిత్, జగదీష్, కళ్యాణ్, శ్రీహరి, కృష్ణ, అశోక్, ఎం.శ్రీనివాస్, వేణు, కాలె అమర్నాథ్ పాల్గొన్నారు.


బాస్ కార్యాలయంలో బ్రోచర్ ఆవిష్కరణ

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

చార్మినార్: విద్యుత్ మరమ్మతుల కారణంగా మంగళవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని టీజీఎస్పీడీసీఎల్ చార్మినార్ సీబీడీ ఏడీఈ ఓ ప్రకటనలో తెలిపారు. కులీ కుతుబ్ షా స్టేడియం విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని కుడా స్టేడియం, సిటీ కాలేజ్, మెహేంది, చేలాపురా, మూసా బౌలీ తదితర ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు. అలాగే పేట్ల బురుజు విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని పేట్ల బురుజు, పురాణాపూల్, పీటీఓ, మెడ్స్ దగ్గర ప్రాంతాల్లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా లో అంతరాయం ఉంటుందన్నారు.

పొట్టి శ్రీరాములు వర్సిటీ పేరు మార్పును అడ్డుకోవాలని లేఖలు

అఫ్జల్‌గంజ్: పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీ పేరు మార్పును అడ్డుకోవాలని ప్రధాన మంత్రి, రాష్ట్రపతితో పాటు రెండు తెలుగు రాష్ట్రాలు సహా మరో 11 రాష్ట్రాల ముఖ్యమంత్రులు, గవర్నర్లు, కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే, అగ్రనాయకుడు రాహుల్‌గాంధీ, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ, ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఒవైసీలకు లేఖలు రాసినట్లు ప్రజాఏక్తా పార్టీ జాతీయ అధ్యక్షుడు బోనాల శ్రీనివాస్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం యూనివర్సిటీ పేరు మార్పుపై పునరాలోచన చేసే విధంగా ఒత్తిడి తీసుకురావాలని ఆయన కోరినట్లు తెలిపారు.

బడే మసీదు నూతన కమిటీని తక్షణమే నియమించాలి


సయ్యద్ ముస్తాక్ అలీ

నాంపల్లి: మల్లేపల్లి బడే మసీదుకు తక్షణమే నూతన కమిటీని నియమించాలని బీఆర్ఎస్ నేత, మల్లేపల్లి నివాసి సయ్యద్ ముస్తాక్ అలీ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన సోమవారం మల్లేపల్లిలో విలేకర్లతో మాట్లాడారు. కొన్నేళ్ల క్రితమే మల్లేపల్లి మసీదు కమిటీ పూర్తిగా రద్దు అయినట్లు ఆయన వివరించారు. కరోనా సమయంలో ఈ కమిటీ చైర్మన్ జబ్బార్ మృతితో మళ్లీ ఎన్నికలు జరగలేదన్నారు. నూతన కమిటీని ఏర్పాటు చేయాలని రాష్ట్ర వక్ఫ్‌బోర్డు సీఈఓకు ఎన్నో వినతి పత్రాలు అందజేసినా ప్రయోజనం లేకుండా పోయిందని ఆరోపించారు. వక్ఫ్ బోర్డు ఆధీనంలోని మసీదులకు సకాలంలో కమిటీలను ఏర్పాటు చేయాల్సిన బాధ్యత రాష్ట్ర వక్ఫ్‌బోర్డుకు ఉందన్నారు. ఇటీవల నూతన కమిటీని ఏర్పాటు చేయాలంటూ హైకోర్టు ఆదేశాలు జారీ చేసినా వక్ఫ్‌బోర్డు ఏర్పాటుకు చొరవ చూపడం లేదని తెలిపారు. అనధికారిక సభ్యులుగా కొందరు చలామణీ అవుతూ మసీదుకు సంబంధించిన వ్యాపార సముదాయ నిర్మాణాలు, కేటాయింపులు, ఖర్చుల పేరుతో నిధుల దుర్వినియోగానికి పాల్పడుతున్నారని ఆరోపించారు.

డేటా సైన్స్ శిక్షణతో ఉత్తమ అవకాశాలు


శిక్షణకు ఎంపికైన విద్యార్థులతో వైస్ ప్రిన్సిపల్, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు

చార్మినార్: డేటా సైన్స్ శిక్షణతో భవిష్యత్తులో ఉత్తమ అవకాశాలు పొందవచ్చని, అలాంటి శిక్షణకు తమ కాలేజీ విద్యార్థులు ఎంపిక కావడం సంతోషంగా ఉందని ప్రభుత్వ సిటీ కాలేజీ వైస్ ప్రిన్సిపాల్ డా.విప్లవ దత్ శుక్లా అన్నారు. యునైటెడ్ వే ఆఫ్ హైదరాబాద్ అనే ఎస్ జీవో సంస్థ, టెక్స్ అకాడమీ సహకారంతో తమ కాలేజీ విద్యార్థులకు ఉచిత శిక్షణ అందించటానికి ముందుకు రావటంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. రెండు వడపోతల తర్వాత శిక్షణకు ఎంపికైన 28 మంది విద్యార్థులకు సోమవారం కాలేజీలో జరిగిన ఓ ప్రత్యేక కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ధ్రువపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తమ విద్యార్థులు మూడు నెలల శిక్షణ అనంతరం వివిధ ఐటీ సంస్థలలో డాటా సైన్స్ సంబంధిత ఉద్యోగాలకు అర్హులవు తారన్నారు. రాబోయే రోజుల్లో మరికొంత మంది విద్యార్థులను ఈ తరహా శిక్షణకు ఎంపికయ్యేలా చర్యలు తీసుకుంటున్నామని కంప్యూటర్ సైన్స్ విభాగాధ్యక్షుడు డా.నాగేశ్వర్ తెలిపారు. ఎన్‌జీవో ప్రతినిధులు సుమని, భరత్ మేరుగు మాట్లాడుతూ..గతంలో తమ సంస్థ తరఫున కాలేజీ విద్యార్థులకు నగదు, పుస్తకాల రూపంలో స్కాలర్‌షిప్పులు అందించామని, ఈ సంవత్సరం టెక్స్ అకాడమీతో కలిసి ఐటీ సంబంధిత సాంకేతిక శిక్షణ ఉచితంగా అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు శ్రవణ్, అవంతి, బబిత, అనూష పాల్గొన్నారు.

శాస్త్రీయ సంగీత కళల్లో చిన్నారులను ప్రోత్సహించాలి


వక్తలతో జస్టిస్ శేష శయనయరెడ్డి తదితరులు

గన్‌ఫౌండ్రీ: శాస్త్రీయ సంగీత కళల్లో రాణించేలా చిన్నారులను తల్లిదండ్రులు ప్రోత్సహించాలని విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ శేష శయనయ రెడ్డి అన్నారు. సోమవారం రవీంద్రభారతిలో తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో శ్రీ ఆకాంక్ష చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నూతన సంవత్సర వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..పిల్లలు నృత్య సంగీత సాహిత్యాలలో సాధికారతను సాధిస్తారని తద్వారా మన సంస్కృతి వెలి విరుస్తుందని తెలిపారు. అంతకు ముందు చిన్నారుల నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ప్రముఖ నాట్య గురువు అంజుబాబు, హైకోర్టు న్యాయవాది పీబీ.విజయకుమార్, అభినంద సంస్థ కార్యదర్శి ఇ.భవాని, సంస్థ వ్యవస్థాపకురాలు పాలపర్తి సంధ్యారాణి, కన్వీనర్ రఘుశ్రీ పాల్గొన్నారు.

డైరీ ఆవిష్కరణ

యాకుత్‌పురా: హైదరాబాద్ సిటీ సివిల్ కోర్టు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రూపొందించిన 2025 నూతన సంవత్సరం డైరీని సోమవారం పురానీహవేలీలోని అసోసియేషన్ కార్యాలయంలో సభ్యులు ఆవిష్కరించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వై. శ్రీనివాసాచారి, ప్రధాన కార్యదర్శి దుబ్బక హర్షవర్ధన్, ఉపాధ్యక్షులు కే. ప్రవీణారెడ్డి, సంయుక్తా కార్యదర్శి బర్క రాజేష్ కుమార్, లైబ్రేరియన్ సుధంష్ కుమార్, క్రీడా, సంస్కృతిక కార్యదర్శి సైదిరెడ్డి పాల్గొన్నారు.


డైరీ ఆవిష్కరిస్తున్న శ్రీనివాసా చారి, సభ్యులు


డైరీని ఆవిష్కరిస్తున్న కన్నయ్య మిట్టల్, అజిత్ హిందుజ

అబిడ్స్: 2025 ఏ.హెచ్ న్యూస్ నూతన సంవత్సర డైరీని ఆల్ ఇండియా భజన్ సామ్రాట్ కన్నయ్య మిట్టల్ ఆవిష్కరించారు. సోమవారం ఏహెచ్ న్యూస్ ఎండీ అజిత్ హిందుజ, మనీష్ బన్సల్, పీయూష్ గుప్తా, రాంబిలాస్ షర్మ తదితరులు ఈ ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్నారు. కన్నయ్య మిట్టల్ మాట్లాడుతూ..సమాజ శ్రేయస్సుకు సోషల్ మీడియా ప్రభావం ఎంతో పెరిగిందన్నారు.

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం పతనం ఖాయం


కేంద్ర మంత్రి బండి సంజయ్‌తో దేవర శ్రీనివాస్ తదితరులు

గోల్కొండ: తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం పతనం ఖాయం అని కేంద్ర మంత్రి బండి సంజయ్‌కుమార్ అన్నారు. బీజేపీ కిసాన్‌మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు దేవర శ్రీనివాస్ సోమవారం ఆయనను కలిశారు. రైతు సమస్యలపై కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా తాము చేపడుతున్న నిరసన కార్యక్రమం వివరాలను కేంద్ర మంత్రికి వివరించారు. ఈ సందర్భంగా బండి సంజయ్‌కుమార్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ సంవత్సర పాలనలోనే ప్రజలకు రేవంత్‌రెడ్డి నిజస్వరూపం తెలిసిపోయిందన్నారు. నేడు రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులకు జీతాలు చెల్లించలేని పరిస్థితి ఉందంటే అది ప్రభుత్వ అవినీతికి నిదర్శం అని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలు, అవినీతిని ప్రజల్లోకి తీసుకువెళ్లాలన్నారు. ఆయనను కలిసిన వారిలో వెంకటేష్ సాగర్, శ్రీనాథ్ తదితరులున్నారు.

వైకుంఠ ఏకాదశి ఉత్సవాలకు ఆహ్వానం


జోనల్ కమిషనర్‌కు శాలువా కప్పి ఆహ్వాన పత్రికను అందజేస్తున్న ప్రతినిధులు

చార్మినార్: రాబోయే వైకుంఠ ఏకాదశి ఉత్సవాలకు హాజరుకావాలని జీహెచ్‌ఎంసీ చార్మినార్ జోనల్ కమిషనర్ వెంకన్ననాయక్‌కు బాలాజీ ఆలయ ప్రధాన అర్చకుడు శృంగరం రమణాచార్యులు, భాగ్యనగర్ గణేశ ఉత్సవ సమితి సభ్యుడు ప్యారసాని వెంకటేష్ కోరారు. ఈ మేరకు సోమవారం ఆయనను కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..చార్మినార్‌లోని వేంకటేశ్వర ఆలయంలో జనవరి 10 నుంచి 14 తేదీ వరకు వైకుంఠ ఏకాదశి ఉత్సవాలు జరగనున్నందున..భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా జీహెచ్‌ఎంసీ తరఫున తగిన చర్యలు తీసుకోవాలని కోరామన్నారు. తమ ఫిర్యాదు మేరకు జోనల్ కమిషనర్ సానుకూలంగా స్పందించి పనులు త్వరగా చేపట్టాలని ఆదేశాలు జారీ చేశారన్నారు.

ప్రజావాణిని సద్వినియోగం చేసుకోవాలి


ఫిర్యాదులు స్వీకరిస్తున్న జోనల్ కమిషనర్

చార్మినార్: ప్రజావాణిని సద్వినియోగం చేసుకోవాలని జీహెచ్‌ఎంసీ చార్మినార్ జోనల్ కమిషనర్ వెంకన్న తెలిపారు. జోనల్ కమిషనర్ పర్యవేక్షణలో సోమవారం జోనల్ కమిషనర్ కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో సంతోష్‌నగర్ పరిధిలోని సైదాబాద్ శ్మశాన వాటి, చాంద్రాయణగుట్ట సర్కిల్ పరిధిలోని అక్రమ నిర్మాణం, సీసీ రోడ్డు నిర్మాణం, వీధి దీపాలకు సంబంధించిన మొత్తం 4 ఫిర్యాదులు అందాయి. ఈ సందర్భంగా జోనల్ కమిషనర్ మాట్లాడుతూ..ప్రజావాణిలో అందిన ఫిర్యాదులపై ఎప్పటికప్పుడు స్పందిస్తూ సంబంధిత విభాగాలచే వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో జోనల్ జాయింట్ కమిషనర్ శైలజా, ఎస్ఈ మహేశ్వర్‌రెడ్డి, వెటర్నరీ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, యూబీడీ డిప్యూటీ డైరెక్టర్ అమీనా బి, టౌన్ ప్లానింగ్ సిటీ ప్లానర్ మహమ్మద్ అబ్దుల్ మజీద్, ఏఎంసీ రాజారావు, ఎలక్ట్రికల్ ఈఈ రామారావు, సీనియర్ అసిస్టెంట్ హమీద్, బిల్ కలెక్టర్ రాజేష్ పాల్గొన్నారు.

దళితులు, బీసీలకు అండగా మజ్లిస్


అక్బరుద్దీన్ ఒవైసీతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: మజ్లిస్ పార్టీ ఎప్పుడూ నిరుపేదలు, బీసీలు, దళితులకు అండగా ఉంటుందని శాసన సభ మజ్లిస్ పక్ష నేత అక్బరుద్దీన్ ఒవైసీ అన్నారు. సోమవారం ఎమ్మెల్యే కౌసర్‌మోహియుద్దీన్ ఆయనను కలిశారు. కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా అంబేడ్కర్ గురించి చేసిన వాఖ్యలపై మజ్లిస్ ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన బహిరంగ సభ విశేషాలను ఎమ్మెల్యే కౌసర్‌మోహియుద్దీన్ ఆయనకు వివరించారు. ఈ సందర్భంగా అక్బరుద్దీన్ ఒవైసీ మాట్లాడుతూ.. నగరానికి దళిత మేయర్‌ను అందించిన ఘనత మజ్లిస్ పార్టీదే అని అన్నారు. మజ్లిస్ పార్టీ తరఫున ఎందరో దళిత సోదరులు, పేద బడుగు వర్గాల వారు ప్రజా ప్రతినిధులుగా ఎన్నికయ్యారని ఆయన గుర్తు చేశారు. కార్వాన్ నియోజకవర్గంలో దళిత బస్తీల అభివృద్ధికి నిరంతరం కృషి చేయాలని ఆయన కౌసర్ మోహియుద్దీన్‌కు సూచించారు.